
# వీధి నాటకాలను ప్రోత్సహించాలి


పాత్రదారులు,కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**చౌడపూర్ మే25,ప్రభాతవార్త :** కళా రంగంలో వీధి నాటకాలకు మంచి గుర్తింపు ఉండేదని,వీధి నా టకాలను ప్రోత్సహించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.చౌడపూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీ భక్త శిరియాల వీది నాటకంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పాత్రదారులు, కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్‌కు మార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, మండల ఉపాధ్యక్షుడు రాములు, జంగయ్య, వెంకట్, ఆంజనేయులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు చేపట్టాలి
## జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు

**చేవెళ్ళ, మే 25 ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో 20 పాఠశాలలు ఎంపికైయ్యాయి. ఇందులో భాగంగా శనివారం చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి, కౌకుంట్ల,గొల్లపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలల్లో కలియ తిరిగి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో గ్రామాల సమైక్య ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌళిక వసతులను చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, డిఈఈ, ఎంపిడివో హిమబిందు, పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణరెడ్డి,దేవునిఎర్రవల్లి గ్రామ మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పూడూర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రాసెగింగ్ క్లస్టర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

# పూడూర్‌లో ప్రాసెసింగ్ క్లస్టర్‌ను సందర్శించిన కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో ఆదర్శ రైతు సేవా సహకార సంఘంలో పరిశ్రమల పునరుత్పత్తి పథకంలో భాగంగా సూక్ష్మ, చిన్న తరహా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ క్లస్టర్‌ను శనివారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. ఈ సందర్భంగా యంత్రాల కొనుగోలు, వాటి ఏర్పాట్ల విషయాలను పరిశీలించి అధికారు లకు తగిన సలహాలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి, కూరగాయలు, పండ్ల ధరలు పడిపోయినప్పుడు వాటిని ప్యాక్ చేసి, సాసులు, పౌడర్, చట్నీలు చేయడానికి ఈ క్లస్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లా పరిధిలోని మార్కెట్ల నుండి ఏటా 190 టన్నుల కూరగాయలు, పండ్లు వ్యర్థమవుతున్నాయని, ఈ వ్యర్థాన్ని అరికట్టడానికి కూడ సహాయకరంగా మారుతుందన్నారు. దీనికి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజ గాంధీ, ఎన్ఐ ఎంఎస్ఎంఈ అధికారి సూర్య ప్రకాష్ గౌడ్, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని కూకట్‌పల్లికి చెందిన విద్యాసాగర్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కారులో ఔటర్ రింగురోడ్డు మీదుగా బీబీనగర్ వెళుతున్నారు. మార్గ మధ్యలో మేడ్చల్ మండల పరిధి కండ్లకోయ శివారులోకి రాగానే చిన్నపిల్లలకు వాంతులు చేసుకుంటున్నారని ఓఆర్ఆర్ పై అత్యవసర మార్గంలో ఎడమవైపు కారును ఆపారు. అదే సమయంలో వెనుక నుండి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం వారి కారును డీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజిత్‌రామ్ (13) అనే చిన్నారుడు అక్కడి కక్కడే మృతి చెందగా, విద్యాసాగర్‌కు గాయాలైయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు.

# ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో అక్రమ డొనేషన్లను అరికట్టాలి
## గోదా అరుణ్ యాదవ్ డిమాండ్

**మేడ్చల్, మే 25, ప్రభాతవార్త :** ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా కోర్సుల కళాశాలల్లో జరగుతున్న అక్రమ డొనేషన్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్ యాదవ్ డిమాండ్ చేశాడు. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఏ తదితర వృత్తి విద్యా కోర్సుల్లో మేనేజ్మెంట్ సీట్లతో పాటు కన్వీనర్ కోటా సీట్లను కళశాలలు లక్షల్లో డొనెషన్‌లను వసూలు చేస్తున్నాయని ఆరోపించాడు. కళాశాల స్థాయిని బట్టి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని, వాటిని ఉన్నత విద్యామండలి అధికారులు అరికట్టాలని కోరాడు. కన్వీనర్ కోటా సీట్లలో కూడ స్లైడింగ్ చేస్తూ సీట్లను మిగుల్చుకుని అమ్ముకుంటున్నాయని, ఇలా అమ్ముకోవడం చట్ట విరుద్ధమని అన్నాడు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని డొనేషన్ల అక్రమాన్ని అరికట్టాలని డిమాండ్ చేశాడు.

# విత్తనాల కొనుగోలు పట్ల జాగ్రత్తలు పాటించాలి
## కేశంపేట మండల వ్యవసాయ అధికారి శిరీష్

**కేశంపేట, మే25,ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని రైతులకు విత్తనా ల కొనుగోలుపై మండల వ్యవసాయ అధికారి శిరీష పలు రకాల సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేట ప్పుడు లైసెన్స్ కలిగి ఉన్నడీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని లూజుగా ఉన్న సంచుల విత్తనాలను అసలే కొనవద్దని అన్నారు. కొన్న విత్తన ప్యాకెట్లకి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అదేవిధంగా విత్తనాల ప్యాకెట్లను వాటిపై ఉనన రకాన్ని చూడా ఖచ్చితంగా గమనించుకోవాలని ఒకటికి రెండు సార్లు అవి సరైనవా కాదా సరిచూసుకోవాలని ఆమె రైతులక చూచించారు. రైతులకు ఎవరైనా కల్తీ విత్తనాలను అమ్మ రైతులను పక్కదారి పట్టించి మోసం చేస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వారి షాపులను కూడా సిజ్ చేస్తామని ఆమె తెలిపారు. కేశంపేట మండలకేంద్రం తోపాటు మండల పరిధిలోని అల్వాల, ఇప ్పలపల్లి, బోదునం పల్లి బైర్కాన్‌పల్లి నిడుదవెళ్లి గ్రామాలలో శనివారం రైతులకు విత్తనాల కొనుగోలుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆయా గ్రామాల రైతులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్ సుధా లలిత సయుద్దీన్ సమీనా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శిరీష్

# అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో మహిళలు భాగస్వాములు కావాలి
## జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న పనుల్లో మహిళలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ మున్సిపల్, మండల పరిధిలోని కొంపల్లి, రామయ్య గూడ, కొటాల గూడ, కామారెడ్డి గూడ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకై బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు.పాఠశాలల్లో చేపట్టే వివిధ పనులకు అంచనాల మేరకు కొంత నిధులను ముందుగానే చెల్లించడం జరిగిందన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలల్లో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో కూడుకొని ఉండాలని కలెక్టర్ సూచించారు.అమ్మ ఆదర్శపాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా మౌలిక సౌకర్యాలు అయిన మంచి నీటి సౌకర్యం,టాయిలెట్స్ నిర్మాణాలు, మరమ్మత్తులు,విద్యుత్తు పనులను చేపట్టాలన్నారు. పాఠశాలల్లో చేపట్టవలసిన పనులను మంజూరు అయిన నిధుల ద్వారా పక్కగా చేపట్టాలని ఆయన తెలిపారు. వర్షాలు కురిస్తే సమయాల్లో లీకేజీలు ఉంటే అలాంటి వాటిని సరి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినిఎప్ప టికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తిఅయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### నూతన పాఠశాల భవనాలుగా తీర్చిదిద్దాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ పాఠశాలల్లో కావలసిన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టే విధంగా చర్యలుతీసుకోవాలన్నారు.తలుపులు,కిటికిలు,గోడల పగుళ్ళ, సిలింగ్ పనులు వంటివి చేపట్టి కొత్త పా ఠశాల భవనాలుగా తీర్చిదిద్దాలని సూచించారు.

### కోటాలగూడ బేష్

కొటాలగూడ పాఠశాలలో చేపడుతున్న పనులు కలెక్టర్ పరిశీలించిన అనంతరం పనులు నాణ్యతగా ఉన్నాయని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శాంతాబాబు,పనులు చేపడుతున్న బాల్ రెడ్డిలను కలెక్టర్ అభినందించారు. ఇంకా పాఠశాలలో చిన్న చిన్న పనులను చేపట్టి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని కలెక్టర్ ఉంచారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల ప్రత్యేక అధికారి, జడ్పి సీఈఓ సుదీర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్,ఎంపిడిఓ వినయ్ కుమార్,మండల విద్యాధికారి బాబు సింగ్, ఏపిఓ నాగరాజు,కొంపల్లి హెచ్ఎం వెంకట్ రెడ్డి, కామారెడ్డి,హెచ్ఎం మౌనిక,కోటాల గూడ హెచ్ఎం వెంకట్ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాలలు చైర్మన్లు రహిమ బేగం, స్వరూప, శాంతాబాబు, సుజాత,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శామీర్‌పేట పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలి
## మాజీ జడ్పీటిసి బాలేశ్ సిఎంను కలిసి విన్నపం


సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్

**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త** శామీర్‌పేట పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా, పర్యాటక కేంద్రంగ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ కలిసి విన్నవించారు. గతంలో శామీర్‌పేట పెద్ద చెరువు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే అభివృద్ధి చెంది ఆ తరువాత గత కొన్నేళ్ల నుంచి అభివృద్ధి కుంటు పడిందని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఈ సందర్భంగ శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ మాట్లాడుతూ శామీర్‌పేట పెద్ద చెరువు ఇక ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మళ్లీ అభివృద్ధి చెందనుందని ధీమాను వ్యక్తం చేశారు. ఈ పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారని ఈ విషయంలో సానుకూలంగ స్పందించారని అన్నారు. నగరానికి చేరువలో ఉన్న శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ గుర్తించి విహారయాత్రీకులకు సౌకర్యాలు కల్పించాలని, శ్రీకట్టమైసమ్మ ఆలయానికి ఈ పెద్ద చెరువుకు వచ్చె భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సిఎంను కోరటం జరిగిందన్నారు. గతంలో పర్యాటక శాఖ వారు నామమాత్రంగ నిధులు కేటాయించి నామమాత్రంగానే పనులు చేపట్టారని ఆయన అన్నారు. శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించటానికి, శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకోవటానికి సెలవు దినాల్లో, మిగతా రోజుల్లోనూ భక్తులు, విహారయాత్రీకులు భారీ సంఖ్యలో వస్తూ ఉంటారని అన్నారు. ఈ పెద్ద చెరువు రైతాంగంతో పాటు విహారయాత్రీకులకు సైతం దోహదపడుతుందని అన్నారు. గత ఏడాది రెండేళ్ల నుంచి ప్రతి ఏడాది ఈ పెద్ద చెరువు నిండి ఆహ్లాదకరంగ నిండు కుండలా నీటితో కనిపిస్తుందని భక్తులను, విహారయాత్రీకులను ఆకర్షింపజేస్తుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శామీర్‌పేట పెద్ద చెరువును అభివృద్ధి చేశారని ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు అంతగ పట్టించుకోలదని అన్నారు. రాజీవ్‌రహదారి పక్కనే శామీర్‌పేట పెద్ద చెరువు ఉండి నగరంలోని వివిధ ప్రాంతాల వారికి వివిధ జిల్లాల నుంచి రాకపోకలు నిర్వహించే వారికి కూడ ఈ పెద్ద చెరువు విహారయాత్ర స్థలంగ కనిపిస్తుందన్నారు. ఈ పెద్ద చెరువుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ అభివృద్ధి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరటం జరిగిందని మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదు నెలల్లో సిఎం రేవంత్‌రెడ్డిని ఎంపి ఎన్నికలకు ముందుగా మేడ్చల్ నియోజకవర్గం కండ్లకోయలో జరిగిన సభలో, ఎంపి ఎన్నికల ప్రచార సమయంలో అంతాయిపల్లిలో జరిగిన సభలోనూ శామీర్‌పేట పెద్ద చెరువును, ఉమ్మడి మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని కలిసి కోరటం జరిగిందన్నారు. ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డిని మరోసారి కలిసి శామీర్‌పేట పెద్ద చెరువును అభివృద్ధి చేయటానికి, సమస్యలను పరిష్కరించటానికి కృషి చేయాలని కోరినట్లు, సిఎం సానుకూలంగ స్పందించారని శామీర్‌పేట పెద్ద చెరువు అభివృద్ధి విషయంపై దృష్టి సారిస్తారన్న నమ్మకం ఉందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరగటానికి అవకాశం ఉందని మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ ధీమాను వ్యక్తం చేశారు.


పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న జడ్పీటిసి దశరథ్ నాయక్,ప్రజా ప్రతినిధులు

# నిషేధిత ధరణి జాబితా నుండి రైతన్నల వ్యవసాయ పొలాలు తొలగించాలి

**కడ్తాల్, మే 25 ప్రభాతవార్త :** మండలంలోని కడ్తాల్, కర్కల్ పహడ్, ముద్విన్ గ్రామాలలోని పలువురు రైతులు వారి వ్యవసాయ పొలాలు ధరణి నిషేధిత జాబితాలో ఉండడంతో తీవ్ర సమస్యలకు గురవుతున్నారని జడ్పీ టిసి దశరథ్ నాయక్ జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటి సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఫార్మాసిటీ ఏర్పాటు కొరకు గతంలో ప్రభుత్వం ఈ ప్రాంతంలో భూములు సేకరించగా రెవెన్యూ, పరిశ్ర మల శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఫార్మాసిటీ పరిధి లోకి రాని వ్యవసాయ భూములు కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వలన రైతులు రుణాలు పొందడానికి, వ్యక్తిగత అవసరాల కొరకు క్రయ విక్ర యాలు జరుపుకోలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, మనోవేదనకు గురై కొంతమంది జిల్లా స్టాండింగ్ కమిటి సమావేశంలో చర్చించారు. ఈ విషయంపై జిల్లా పరిశ్రమల శాఖ నుంచి నిషేధిత జాబి తాలో ఉన్నటువంటి వ్యవసాయ భూముల వివరాలు ఇవ్వాలని కోరగా ఈ రోజు దశరథ్ నాయక్ కడ్తాల్ పలువురు నేతలతో కలిసి జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మికి వివరాలు అందజేశారు. ఫార్మాసిటీ పరిధిలోనికి రాని వ్యవసాయ భూములను నిషేధిత జాబితా నుండి వెంటనే తొలగించి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వివరాలు అందజేసిన వారిలో రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మి నరసిం హారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ వెంకటేష్ గుప్తా, వైస్ ఎంపిపి ఆనంద్, ఎంపిటిసి లచ్చిరాం నాయక్ పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం పోరాటంతో పే స్లిప్పులు
## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

**యాచారం మే25,ప్రభాతవార్త :** వ్యవసాయ కార్మిక సంఘం పోరాటంతో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ఉపాధి కూలీలకు పేస్లిప్పులు అందజేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య ,జిల్లా నాయకులు జంగయ్య, మండల నాయకులు బెల్లి ఇందిరమ్మ ,ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని సింగారం గ్రామంలో ఉపాధి కూలీల దగ్గరికి పోయి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు నెలలు గడిచినా పే స్లిప్పులు ఇవ్వడం లేదని అధికారులు పిడి, ఎంపిడివో ,ఎపిఓలకు ప్రతి రోజులు చెప్పిన ఫలితం లేకపోవడంతో శనివారం మాల్ గ్రామపంచాయతీ ముందు ధర్నా చేస్తామని ప్రకటించగా అధికార యంత్రాంగం అంత కదలి మండలంలో అన్ని గ్రామ పంచాయతీలకు స్లిప్పులు విడుదల చేయడం జరిగిం దని అన్నారు. కూలిలందరికి పే స్లిప్పులు క్రమం తప్పకుండా ప్రతి వారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త పనులు మంజూరు కాకపోవడంతో వేలాది మంది కూలీలు పని లేక ఇంటికాడ ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతు న్నారని అన్నారు.మండలంలో 12వేల మంది కూలీలకు గాను 3800 మంది కూలీలు మాత్రమే పనిచేస్తున్నారని ఎన్నికలు ముగిసి రెండు వారాలు అవుతున్న కొత్త పనులు మంజూరు కాలేదని వెంటనే డ్వామా పిడి చొరవ తీసుకొని కొత్త పనులను మంజూరు ఇచ్చి కూలీలందరికి పని కల్పించాలని కోరారు.


కూలీలకు పే స్లిప్పులు అందజేస్తున్న అంజయ్య,తదితరులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు

# బషీరాబాద్‌లో నకిలీ విత్తనాల పట్టివేత
## ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
## సుమారు 415కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం

**తాండూరు, మే 25, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో అధికారులు పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని సుమారు 415కిలోల నకిలీ విత్తనాలను స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇందుకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎక్మాయి గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు శనివారం బషీరాబాద్ ఎస్ఐ రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి వెన్నెల సూర్య ప్రకాష్ సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులుకర్ణాటక రాష్ట్రం మదికంటి గ్రామానికి చెందిన వి. విఠలప్ప, దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు అనుమానాస్పదంగా వారి చేతుల్లో రెండు విత్తనాల సంచులతో కలనిపించారు. వారి వద్ద పరిశీలించగా నకిలీ విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని విచారించగా దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు దగ్గరి నుండి నకిలీ పత్తి విత్తనాలను తీసుకువచ్చి బషీరాబాద్ మండలంలో అమాయన రైతులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు వారి వద్ద నుండి సుమారు 415 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాదీనం చేసుకొని సీజ్ చేయడంతో పాటు కర్ణాటక రాష్ట్రం మదికంటి గ్రామానికి చెందిన వి. విఠలప్ప, దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
## డిసిఎంఎస్ వైస్‌చైర్మన్, శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి



అలియాబాద్‌లోని వరి ధాన్యం కొనుగోలు సెంటర్‌ను సందర్శించి వరి ధాన్యంను పరిశీలిస్తున్న డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి,పాల్గొన్న మండల రైతు నాయకులు కె.కృష్ణారెడ్డి

**శామీర్‌పేట, మే 25, ప్రభాతవార్త** రైతులు పండించిన వరి ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేయటం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వరి ధాన్యంను ఆయన పరిశీలించారు. రోజుకు ఎన్ని బస్తాలు వరి ధాన్యం వస్తుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితితులు ఉన్నందున రైతులు వెంటనే వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యాన్ని మ్యాచరింగ్ చూసి కొనుగోలు చేయాలని సూచించారు. నాణ్యతగా ఉన్న గన్నీ బ్యాగులను రైతులకు పంపిణీ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ దాన్యంను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల రైతు నాయకులు, మాజీ ఉపసర్పంచులు కంటం కృష్ణారెడ్డి, జి. ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్ నరేందర్‌రెడ్డి, రైతు నాయకులు సంజీవరెడ్డి, వీరారెడ్డి, రాజు, రాంరెడ్డి, ఎల్లయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ..తహసీల్దార్


అలియాబాద్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ యాదగిరిరెడ్డి

అలియాబాద్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి సందర్శించారు. శనివారం ఆయన సందర్శించి వరిధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. రైతులకు అవసరం ఉన్న గన్నీ బస్తాలను ఇవ్వటం జరుగుతుందని, రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండ చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంపై రైతులతో మాట్లాడి కొనుగోలుపై ఆరా తీశారు. ఆ తరువాత శామీర్‌పేటలోని సొసైటీ వద్ద ఉన్నవరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడ తహసీల్దార్ యాదగిరిరెడ్డి సందర్శించి వరి ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు.



# విద్యుత్‌శాఖ యాక్షన్ ప్లాన్..!


-వర్షాకాలం నేపథ్యంలో ముందుస్తు చర్యలు

-విద్యుత్ స్థంబాలు, లైన్లపై స్పెషల్ డ్రైవ్

-చెట్లున్న ప్రాంతాల్లో ఎల్‌టీఏవీ కేబుల్స్ ఏర్పాటు

-సర్కిళ్ల వారిగా కంట్రోల్ రూంలు

-24గంటలు పనిచేందుకు విపత్తు నిర్వహణ బృందాలు



**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** వానాకాలంలో విద్యుత్ సరఫరాలో కలిగేఅంతరాయాలను అధిగమించేందుకు విద్యుత్‌శాఖ సమాయత్తమైంది. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిస్కం ముందుస్తు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గత అనుభవాలను దృష్ట్యా ఇప్పటికే పటిష్ట చర్యలకు సిద్దమైన అధికారులు విపత్తులను ఎదుర్కొంనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. పాత విద్యుత్ తీగల లైన్లు పునరద్దురణతోపాటు కొత్తవి అందుబాటులోకి తేవటం,చెట్ల కొమ్మలను తొలగించడం, నేలకొరిగిన విద్యుత్ స్థంభాల తొలగింపు వంటి పనులు చేపట్టేదుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. అలాగే విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఒక్కోసర్కిల్ పరిధిలో 6-8కంట్రోల్ రూంలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసేలా డిస్కం ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్దం చేశారు. సీబీడీ (సెంట్రల్ బ్రేక్‌డౌన్ గ్యాంగులు) లైన్ సిబ్బంది 24గంటలు విధుల్లో ఉండేలా షిఫ్టింగ్ పద్దతులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ పరికరాల మరమమత్తులకు చేతిగ్లౌజ్‌లు,ఎర్త్‌రాడ్,హెల్మెంట్లు పెద్దసంఖ్యలో స్టోర్లలోస్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏడీఈ ఆధ్వర్యంలో అన్ని విభాగాలకు చెందిన నలుగురు ఏఈలు కంట్రోల్ రూంకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### చెట్లున్న ప్రాంతాల్లో ఎల్‌టీఏవీ కేబుల్స్...

వర్షాకాలంలో ఏచిన్నగాలి వాన వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాంటి సమస్యలను తగ్గించేందుకు చెట్లు ఉన్నప్రాంతాల్లో 800-1000కిలో మీటర్ల ఎల్‌టిఏవీ (లోటెన్షన్ ఎయిర్‌బంచ్) కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రేటర్ జోన్‌లో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈకేబుల్స్‌ను వినియోగిస్తున్న విద్యుత్‌శాఖ నగరవ్యాప్తంగా చెట్లు ఉన్నప్రాంతాల్లో పూర్తిస్థాయి ఏర్పాటు చేయనున్నారు. ఫీడర్లలో ట్రిప్పింగ్,బ్రేక్ డౌన్స్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎల్‌టీఏవీ కేబుల్స్ ఉపయోగపడుతాయని అధికారులు చెబుతున్నారు. వీటి వినియోగంతో విద్యుత్ ప్రమాదాలు జరగవని ఇంజనీర్లు అంటున్నారు. చెట్ల మధ్యలో నుంచి ఎల్‌టీఏవీ కేబుల్స్ ఉన్నా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తవని చెబుతున్నారు. గతేడాది గాలివానకు చోటు చేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని చెట్లు ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో ఈకేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

### అదనంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు..

వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా రిపేర్లు అయ్యే అవకాశాలుండటంతో ఒక్కో సర్కిల్‌లో 50-80 ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా సిద్దం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతరాయాలు ఏర్పడితే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసు కుంటున్నారు. చెట్లు విరిగిన ప్రాంతాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసీ ఏవీ కేబుళ్లతో విద్యుత్ సరఫరా అందించే ప్రత్యామ్నాయ మార్గాలు ముందే సిద్దం చేస్తున్నారు.

### డిజాస్టర్ టీంలు..

చెట్లు విరిగిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్దరణకు 20-25 డిజాస్టర్ టీమ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈటీమ్‌లో కన్‌స్ట్రక్షన్స్, లైన్, ఆపరేషన్ అదికారులతోపాటు డైరెక్టర్ స్థాయి అధికారులవరకు పాల్గొంటారని ఒఉన్నతాధికారి తెలపారు. డిజాస్టర్ టీమ్‌లను ఎఫ్ఒసి, సిబీడీలకు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్నారు. డిజాస్టర్ టీంలో ఐదుగురు అధికారులు ఉండనున్నట్లు ఉన్నతాధికారులు తెలుపుతున్నారు.

## రాజేంద్రనగర్‌ను కాంగ్రెస్‌కు కంచుకోటలా మారుస్తాం : జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**నార్సింగి, మే 25 ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ నియోజకవర్గంను కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారుస్తామని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కొఆపరేటివ్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ నూతన మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలకు శుభా కాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఏం రేవం త్‌రెడ్డి మా బాస్ అని... ఆయన నాకు అప్పగించిన పనులను పూర్తి చేస్తున్నానని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం రేయింబవళ్లు కష్టపడ్డానని, దురదృష్టవశాత్తు గత అసెంబ్లీ ఎన్నికల్లో నాకు టికెట్ రాలేదన్నారు. రాజేంద్రనగర్ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చి ఉంటే ఈ సారి వందశాతం గెలిచే వాడినని, రేవంత్‌రెడ్డి ఆశీర్వాదంతో ఇప్పుడు మంత్రిని లేదా విప్‌ను అయ్యే వాడినని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలు, ఒక కార్పోరేషన్ ఉన్నాయని, వీటన్నింటిని హస్తగతం చేయడమే నా పనిగా పెట్టుకున్నానని తెలిపారు. ఇప్పటికే నార్సింగి మున్సిపల్, బండ్లగూడ కార్పోరేషన్‌లు హస్తగతం అయ్యాయని, త్వరలోనే చట్ట పరంగా శంషాబాద్ మున్సిపల్‌ను కూడా చేజిక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను అర్హులందరికి అందిం చేందుకు ప్రత్యేక శ్రద్ద తీసుకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వరుసగా నాలుగు సార్లు గెలిచినా రాజేంద్రనగర్ నియోకవజకవర్గంలో మౌళిక సదుపాయాలు కల్పించడంలో కూడా విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులపై బురదజల్లేలా కొన్ని వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారని, ఇక నుంచి తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబో మని, సరైన గుణపాఠం చెప్పి తీరుతామని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హెచ్చరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెన్షనర్ల మద్దతు కాంగ్రెస్‌కే

**చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త:** ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రులకు సంబంధించిన శాసన మండలి స్థానానికి జరుగనున్న ఎన్నికల్లో తమ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసొసియేషన్ తెలంగాణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.నర్సింగరావు ప్రకటించారు. శనివారం జరిగిన అసొసియేషన్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ సంఘం కాంగ్రెస్‌వైపే ఉండి ఆ పార్టీ విజయానికి తొడ్పడిందని, ఇప్పుడున్న రాజకీయ, సాంఘిక, అనిశ్చితి పరిస్థితులలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలదొక్కుకుని సుస్థిర పరిపాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది.

# నీరు పోయేలా లేదు..మేమే వెళ్లిపోతాం

-జిహెచ్ఎంసి కమిషనర్ ,ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినా స్పందన కరువు

-బ్రాహ్మణవాడి లైన్ నెంబర్ 1 నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్తున్న స్థానికులు



బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1 లో ప్రహరీ గోడ వద్ద నిల్చిపోయిన నీరు..



ఇల్లు ఖాళీ చేసి సామాన్లతో ఇతర ప్రాంతానికి వెళుతున్న లైన్ నెంబర్ 1 వాసులు

**బేగంపేట మే 25,ప్రభాతవార్త :** రానుంది వర్షాకాలం.చిన్న పాటి వర్షాలకు పై నుంచి వస్తున్న నీరంతా తమ ప్రాంతంలో నీరు పోయే మార్గంలో ఈపీఎఫ్ క్వార్టర్స్ వారు గోడ అడ్డుగా కట్టడం,నీరు పోయే మార్గాన్ని కుదించి చిన్న రంధ్రం ఏర్పాటు చేయడంతో పై నుంచి వస్తున్న వర్షం నీరు తమ ఇళ్లలోకి చేరుతుండటంతో బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1లో నివసించే సుమారు 25 కుటుంబాల వారికి ప్రతి రోజు నరక యాతన మిగిల్సింది.దీంతో అక్కడ నివసిస్తున్న వారు శనివారం తమ సామాన్లతో సహా మరో ప్రాంతనికి తరలి వెళ్లారు.వర్షం నీటికి డ్రైనేజీ నీరు కూడా తోడవడంతో ఆ నీరంతా ఇళ్లలోకి చేరడం, గోడనుంచి వేగంగా పోయే మార్గం లేక రోజుల తరబడి ఇళ్ల ముందు నిల్చిపోవడంతో ఆ కుటుంబాల వారు విసిగి వేసారి పోయారు.తమ నివాసాల ముందు నీరు పోయే మార్గాన్ని కుదించడంతో పాటు నీటి ప్రవాహానికి అడ్డుగా ఈపీఎఫ్ క్వార్టర్స్ వారు ప్రహరీ గోడ నిర్మించడంతో తమ కష్టాలు మరింత అధికమయ్యాయని వారు వాపోయారు. తమ ఇళ్ల ముందు నీరు నిల్చి పోకుండా సాఫీగా సాగేలా చూడాలంటూ జీ హెచ్ఎంసీ కమీ షనర్, వాటర్ వర్క్స్ శాఖాధికారులకు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని మహ్మద్ యహ్యా ఖాన్ ఆరోపించారు.దీంతో మురుగు నీటిలో ఉండి తాము రోగాల పాలవుతున్నామని,భోజనం కూడా చేయలేని పరిస్థితులను ఎదుర్కొన్నామని,అందుకే ఇక అక్కడి ఇళ్లను ఖాళీ చేసి మరో చోటకి తరలి వెళుతున్నామని ఆయన వాపోయారు.తమతో పాటు అజీముద్దీన్ కుటుంబం కూడా అక్కడి ఇంటిని ఖాళీ చేసి వెళ్లి పోయారు.నగరం నడిబొడ్డున ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న బేగంపేట లో ఇలాంటి పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో తమ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని యాహ్యాఖాన్ వాపోయారు.చిన్న పాటి వర్షం వస్తేనే తమ ఇళ్లలోకి రెండు అడుగుల మేర నీరు వచ్చి చేరుతుందని,ఆ నీటిలో ఇంట్లోని సామాన్లన్నీ నానిపోవాల్సిందేనని,దోమలు అధికంగా ఉన్నాయని, తీవ్ర దుర్వాసన తో ఈ ప్రాంతంలోని కుటుంబాలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నాయని వారు ఆవేదన చెందారు.

## నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో దాహం..దాహం..





**నిజాంపేట్, మే 25, ప్రభాతవార్త** గృహావసరాలకే కాదు.. వ్యాపార, ఇండస్ట్రీయల్ అవసరాలకు కావలసినంత నీరు ఉంది.. అయితే 'ట్యాంకర్ మీది.. వాటర్ మాది' అంటూ జలమండలి చేస్తున్న ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వ్యాపార, పారిశ్రామిక అవసరాలకు దేవుడెరుగు.. కనీసం గృహావసరాలకు కూడా సరిపడా నీటిని అందించలేక జలమండలి అధికారులు చతికిలపడిపోతున్నారు. పై నుంచే వాటర్ సప్లై ఉండడం లేదా.. లేక సప్లై ఉన్నా నీటిని వదలడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారో ఏమో గానీ నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ వాసులు నీటి కోసం అల్లాడుతున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ఎప్పుడు నీటిని వదులుతారో మిలియన్నల డాలర్ల ప్రశ్నే.. వాల్వ్ సమస్య పేరిట ఒకసారి, పై నుంచి వాటరన రాలేదని మరోసారి, పైప్‌లైన్ లేకేజీలని ఇంకోసారి.. ఇలా ఏదో ఒక సాకు చెప్పి నిర్ణీత సమయంలో వదలాల్సిన నీటిని సకాలంలో వదలడం లేదు. గత పది రోజుల క్రితం మోటార్ రిపేర్ వచ్చిందంటూ ఐదారు రోజుల పాటు నీటిని సరఫరా చేయలేదు. మోటార్ మరమ్మతులు పూర్తయ్యాక అయినా సక్రమంగా వదులుతున్నారా ? అంటే అదీ లేదు. ఎప్పుడు ఏ సమయంలో వదులుతారో అర్థం కావట్లుదు. వదిలినా లో ప్రెషర్‌తో వదలడంతో కనీస అవసరాలకు కూడా నీరు సరిపోవడంలేదు. శుక్రవారం రోజు నీటు సరపడా కావల్సి ఉండగా 20 నిమిషాల పాటు కూడా సరఫరా చేయకుండా బంద్ చేయడంతో ఏ విధంగా నీటి అవసరాలు తీరతాయని జర్నలిస్టు కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. . ట్యాంకర్లు బుక్ చేస్తే ఎప్పుడు వస్తాయో తెలియదు. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే నీరు సరిపోవడంలేదు. దీంతో నీటి కోసం అవస్థలు పడుతున్నారు. నీటి సరఫరా విషయమై ఓ జలమండలి అధికారిని ప్రశ్నిస్తే వస్తాయ్.. ఓపిక పట్టండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. నీటి సరఫరా చేయకుంటే జర్నలిస్టు కాలనీ వాసులు ధర్నాకు దిగుతామంటూ ఓ అధికారికి చెప్పుకుంటే.. ఆ చేయండి.. నేను కూడా ఓ 80మందిని తీసుకువచ్చి ధర్నా చేయిస్తా.. అంటూ వ్యంగ్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. ప్రజా సేవకు అంకితం కావాల్సిన అధికారులే ప్రజల విషయంలో ఇంత చులకనగా వ్యవహరించడం పట్ల స్థానికంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు మాత్రం నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని క్రిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తుంటే ఇక్కడ మాత్రం నీటి సరఫరా విషయంలో ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టుల కాలనీ వాసుల పట్ల శాపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్ణీత కాలంలో సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

## గజవాహనంపై మలయప్పస్వామి

-దర్శనభాగ్యంతో పులకించిన భక్తులు



గజవాహన సేవ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం మలయప్పస్వామి గజవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో స్వామివారిని వాహనసేవలో దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. అహంకారం తొలగితే భక్తుడికి భగవంతుడు రక్షకుడిగా ఉంటాడనే విషయాన్ని గజవాహన సేవ గుర్తు చేస్తుంది. ఏనుగు ఓంకారానికి, విశ్వానికి సంకేతం. స్వామి ప్రణవ రూపుడు, విశ్వాకారుడూ, విశ్వాధారుడూ కనుక గజరాజుపై ఊరేగడంఎంతో సముచితం.అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థం, బాలభోగము, హవనము, బలిహరణము, మంత్రపుష్పం, ద్రావిడ ప్రబంధ పారాయణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, మహానివేదన, మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం వేదపారాయణాలు, ద్రావిడప్రబంధమ, హవనం పూర్తి చేశారు. తిరిగి బలిహరణము, మహానివేదన, హారతి, మంత్రపుష్పం అనంతరం 'గజవాహనసేవ' చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధుల గుండా వేదపండితుల మంత్రోచ్ఛారణలతో, మంగళవాయిద్యాల నడుమ సాగింది. కాగా ఆదివారం పల్లకీసేవ, రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని అధికారులు కోరారు.

# కౌంటింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

-హాల్‌లోకి మొబైల్ ఫోన్లు నిషేదం

-సిబ్బంది ఏ చిన్న పొరపాటుకు తావివ్వద్దు

-జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్





శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్ రోస్,



హాజరైన సిబ్బంది

**హైదరాబాద్,మే 25,ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికలకు సంబందించిన కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పారదర్శకంగా జరిగేలా నిర్వహించాలని ఏచిన్నపొరపాటుకు సిబ్బంది తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవనంలో మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, ఏఆర్‌వోలకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపుకు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓట్ల లెక్కింపును మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సగ్మెంట్ వారీగా ఓట్ల లెక్కింపు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందని, నిర్ణీత సమయం సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు అందుబాటులో ఉండి సరి చేస్తారని పేర్కొన్నారు.

### ప్రతి హాల్లో 14టేబుళ్ల ఏర్పాటు ...

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అన్ని సెగ్మెంట్లలో ఓట్ల లెక్కింపు ప్రతిహాల్‌లో 14టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని, రౌండ్ల వారీగా కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ప్రతిటేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారని ఆయన వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా కౌంటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమైందన్నారు. మైక్రో అబ్జర్వర్లు రౌండ్‌లవారీగా ప్రతి రిపోర్టును ఎన్నికల అబ్జర్వర్లకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏసమస్య ఉన్నా ఏఆర్‌వోకు తెలపాలని సూచించారు.

### కౌంటింగ్‌హాల్లో మొబైల్ నిషేదం ...

ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడని కమిషనర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్దతతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. కౌంటింగ్ హాల్‌లో ఉండే ఏర్పాట్లు ,కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన ఆయా విషయాలపై రోనాల్డ్‌రోస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్ మెషిన్ కౌంటింగ్ కి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఈసందర్భంగా వివిప్యాట్ స్లిప్పుల కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు సంబంధించన ఆయా ప్రక్రియను ఆయన వివరించారు.ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, కంటోన్మెంట్ జాయింట్ సిఈవో అడిషనల్ కలెక్టర్ (యుబిడి) జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సునంద రాణి ,ఏఆర్‌వోలు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మేయర్ లతా ప్రేమ్‌గౌడ్

- నూతన మేయర్‌ను ఆశీర్వదించిన సిఎం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చాలిస్తున్న బండ్లగూడ జాగీర్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ దృశ్యం.

**నార్సింగి, మే 25 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నూతన మేయర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం పొందారు. రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కొఆపరేటివ్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నాయకత్వంలో మేయర్ లతాగౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు సీఏం నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డిలను కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేయర్ లతాగౌడ్‌ను ఆశీర్వదించి, అభినందించారు. ఈ సందర్భంగా లతా ప్రేమ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ సీఏం, స్పీకర్, ఎంపిల ఆశీర్వాదంతో బండ్లగూడ కార్పోరేషన్‌ను అనతి కాలంలోనే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్పోరేషన్ నిధులతో పాటు జనరల్ నిధులను సైతం పెద్ద ఎత్తున తీసుకు వచ్చి ప్రధాన సమస్యలను శాశ్వత ప్రాతిపాదికన పరిష్కరిస్తామన్నారు. ప్రతీ కార్పోరేటర్ సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని, నిధులను అన్ని డివిజన్లకు సమానంగా విడుదల చేస్తామని తెలిపారు. కార్పోరేటర్లందరి నిర్ణయమే, మా నిర్ణయమని తెలిపారు. గత మేయర్ హయాంలో జరిగిన అవినీతిని వెలికి తీసి కార్పోరేషన్ ప్రజల ముందు పెడ్తామని, అంతా పారదర్శక పాలనను అందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు వంటి వాటికి పెద్దపీఠ వేస్తామని తెలిపారు. గత మేయర్ ముందు చూపు లేకుండా, కార్పోరేటర్ల సూచనలు పట్టించుకోకుండా పోవడంతో ఇప్పుడు కార్పోరేషన్ ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జల మండలి ఉన్నతాధికారులతో సమావేశమై మంచినీటి క్వాంటిటీని పెంచేలా చూస్తామన్నారు. అవసరమైతే బండ్లగూడ కార్పోరేషన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతామని, ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తామని వివరించారు.

# బండిస్తే గండమే !

-మైనర్‌కు వాహనమిస్తే ముప్పు తప్పదు !!

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త :** మైనర్లు వాహనం నడుపుతూ బయటకు వచ్చారంటూ ఆ తప్పు పూర్తిగా వారిదేకాదు, వారికి వాహనాన్ని ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానిదీ తప్పే అంటూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు పలు మార్లు స్పష్టం చేసింది. దీంతో పాటు గతంలో అనేక ఉదంతాల్లో మైనర్ డ్రైవింగ్ పలువురి ప్రాణాలు తీసింది. ఈ పరిణామాలను సీరియస్‌గా తీసుకున్న నగర పోలీసులు మైనర్ డ్రైవింగ్ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించిన కేసుల్లో వాహన యజమానిపైనా కేసు నమోదు చేసి, కోర్టుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయనున్నారు. జుబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 51లో గత నెల 14న రాత్రి కియా కారుతో ప్రమాదం చేసిన ఎర్రగడ్డకు చెందిన మైనర్‌తో (17) పాటు అతడి తండ్రిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విధానాన్ని రానున్న రోజుల్లోనూ కొనసాగించనున్నారు. శాంతిభద్రతల విభాగంతో పాటు ట్రాఫిక్ అధికారులు దీన్ని అమలు చేస్తారు.

### మూడో కేటగిరీలో మైనర్ డ్రైవింగ్..

ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనల్ని ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పుగా మారేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికీ ముప్పును తెచ్చిపెట్టేవి. మైనర్ డ్రైవింగ్ మూడో కేటగిరీ పరిధిలోకి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఏటా నగరంలో నమోదవుతున్న ప్రమాదాలను విశ్లేషిస్తే.. ద్విచక్ర వాహనాల కారణంగానే ఎక్కువగా జరుగుతున్నాయని తేలింది. యువత ఎక్కువగా వినియోగించేది ఈ వాహనాలే. ఆ తర్వాత స్థానం తేలికపాటి వాహనాలైన కార్లు వంటి వాటిది. ఈ కారణంగానే ప్రమాదాల బారినపడుతున్న కారణంగా మారుతున్న వాటిలో ఇవే ఎక్కువగా ఉంటున్నాయి. ద్విచక్ర వాహనాల వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో వాహన చోదకులతో పాఉ పాదచారులూ ఎకు ్కవగా మృత్యువాతపడుతున్నారు. ముఖ్యంగా అనేక విద్యాసంస్థలు నగర శివార్లలో ఉండటంతో సొంత వాహనాలపై వాటికి వెళ్ళి వచ్చే క్రమంలో ఎందరో యువకులు మృత్యువాత పడుతున్నారు. దీనికి తోడు అడపాదడపా చోటు చేసుకుంటున్న రేసింగ్స్ కూడా అనేక మంది ప్రాణాలను హరిస్తున్నాయి. ఇలాంటి మృతుల్లో వాహనాలు డ్రైవ్ చేస్తున్న మైనర్లు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు.

### నిబంధనలేం చెబుతున్నాయంటే..

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం (ఎంవీ యాక్ట్) పదహారేళ్లలోపు వయస్సు వారు ఎలాంటి వాహనాలనూ నడపకూడదు. వీరు వాహనాలను నడుపుతూ రోడ్లపైకి రావడం నిషేధం. 16 ఏళ్లు నిండిన వారు మాత్రం కేవలం గేర్లు లేని సాధారణ వాహనాలు నడిపే అవకాశం ఉంటుంది. 18 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే గేర్లతో కూడిన వాహనాలు నడపడానికి అర్హులు. ఆర్టీఏ అధికారులు లైసెన్స్ సైతం వీరికే మంజూరు చేస్తారు. చట్ట ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనాన్ని ఇచ్చిన యజమాని సైతం శిక్షార్హుడే. అంటే ఎవరికైనా మన వాహనాన్ని ఇవ్వాలంటే తొలుతవారు మేజరేనా ? డ్రైవింగ్ లైసెన్స్ ఉందా ? అనేవి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్న చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం. అమలుపై యంత్రాంగాలు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడం కారణంగా ఎన్నో 'ఇంటి దీపాలు' చిన్న వయసులోనే ఆరిపోతున్నాయి.

### ఎంవీ యాక్ట్‌లోని ఆ సెక్షన్ వాడుతున్నారు.

వారం రోజుల వ్యవధిలో వరుసగా చోటు చేసుకున్న బహదూర్‌పురా, మెహిదీపట్నం ఉదంతాలతో ట్రాఫిక్ పోలీసులు తమ పంథా మార్చుకున్నారు. ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్ కేసుల్లో అత్యంత అరుదుగా మాత్రమే.. అదీ వాహనం నడిపే వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు చేసేవారు. మోటారు వాహనాల చట్టంలోని 180 సెక్షన్ ప్రకారంఒ మైనర్ కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి కానీ వాహనం నడిపితే.. అతడితో పాటు వారికి వాహనం అందించిన దాని యజ మానినీ బాధ్యుడిని చేసే అవకా శం ఉంది. మైనర్ నడిపే వాహనం ప్రమాదానికి కారణం కావడమో, గురికావడమో జరిగితేనే కాదు.. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో చిక్కినా ఈ తిప్పలు తప్పవు. మైనర్లు ఎక్కువగా కుటుంబీకులు, సంబంధీకుల వాహనాలే తీసుకుని బయటకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారే ఆయా కేసుల్లో నిందితులుగా మారే అవకాశం ఉంది. మోటారు వాహనాల చట్టంలోని 181 సెక్షన్ కింద వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేస్తారు. కోర్టులో ఈ నేరం రుజు వైతే జైలు శిక్ష, జరిమానా లేద రెండూ విధించే అవకాశం ఉంది.

## నగరంలో డీలక్స్ బస్సులు

**హైదరాబాద్ మే 25 ప్రభాతవార్త** జంట నగరాల్లో అతి తొందరలో సిటీ బస్సు ప్రయాణం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇందుకుగాను 25 ఎలక్ట్రిక్ ఏసీ, 25 నాన్‌ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు నగరానికి చేరుకున్నాయి.అలాగే మరో 450 ఎలక్ట్రిక్ బస్సులు జులై నెల చివరి నాటికి రోడ్డెక్కనున్నాయి. టీజీఎస్‌ఆర్టీసి తన మెరుగైన ప్రయాణాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది. హైదరాబాద్ సిటీలో ప్రయాణించేందుకు వీలుగా 125 డీలక్స్ బస్సులను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకరానున్నారు. ఈ బస్సులు జులై నుంచి అందుబాటులోకి రాబోతున్నాయి. సిటీలోని అన్ని ప్రధాన రహదారుల్లో డీలక్స్ బస్సుల సేవలు నడపనున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో సిటీ, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'మహాలక్ష్మీ పథకం' కింద మహిళలకు ఉచిత ప్రయాణాలు కొనసాగుతున్నాయి. దీనితో ఈ ఉచిత బస్సులలో టికెట్ హోల్డర్స్ ప్రయాణం చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ ప్రయాణికులున్న బస్సులు ఎక్కలేక అనేక మంది ప్రయాణికులు వేరే రవాణ సదుపాయాల వైపు పరుగులు పెడుతున్నారు.ఈ నేపథ్యంలో అలాంటి ప్రయాణీకులు సౌకర్యవంతంగా వెళ్లేందుకు వీలుగా ఈ కొత్త డీలక్స్ బస్సులను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇక ఈ బస్సులలో ఉచిత మహాలక్ష్మలను, పాస్ హోల్టర్స్‌ను ఈ బస్సులలోకి అనుమతించరు. కేవలం 'పేయిడ్ సర్వీస్' పేరుతో ఈ బస్సులను సిటీలో నడపనున్నారు. డీలక్స్ బస్సులు కాబట్టి టికెట్ ధరలు కూడా కాస్త ప్రీమియంగా కూడా ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



విశ్వకర్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

## అట్టహాసంగా విశ్వకర్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

**నాగల్‌గిద్ద, మే 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం విశ్వకర్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా జరుపుకున్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ కుమార్ శెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పి సుధాకార్‌రెడ్డిలు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహంచారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు సంజీవ్‌పాటిల్, పాండుచారి, సంతోష్ పాటిల్, సంగమేశ్వర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

**సంగారెడ్డి టౌన్, మే 25, ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా ప్యానల్ న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి రమేష్ సూచించారు. శనివారం సంగారెడ్డిలోని కోర్టు అవారణలో లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా ప్యానల్ న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని, రాజీ మార్గం ద్వార కేసులను పరిష్కరించుకుంటే కలిగే ప్రయోజనాలపై వివరించాలని న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె జయంతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్



వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఈశ్వర్ రాణి

**చౌటకూరు, మే 25, ప్రభాతవార్త:** మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు తహసీల్దార్ ఈశ్వర్‌రాణి శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న పాట్లను చూసి తహసీల్దార్ చలించిపోయారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని రైతులు తరలించి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో రైతులు నిత్యం పాట్లు పడుతున్నట్లు తహసీల్దార్ గుర్తించారు. కేంద్రాలకు లారీలు రాకపోవడం, కేంద్రాల్లో వరి ధాన్యం ఉండటంతో రైతులు ప్రయాసపడాల్సి వస్తోందని గుర్తించిన తహసీల్దార్ తార్దన్‌పల్లి చౌరస్తా వద్ద ఉండి అటుగా వచ్చే లారీలను ఆపి ఉప్పరి గూడెం గ్రామానికి తహసీల్దార్ తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం అయిన ధాన్యంను లారీల్లో రైస్ మిల్లుకు తరలించారు. గ్రామాల్లో ఐకెపి, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

-మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



నారాయణఖేడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

**నారాయణఖేడ్ టౌన్, మే 25, ప్రభాతవార్త:** వర్షాకాలం వస్తున్నందున నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. శనివరం మున్సిపల్ పరిధిలోని నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు వహించాలని సిబ్బందికి సూచించామన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వార పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట నుంచి నారాయణఖేడ్ సంపునకు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. సిబ్బందికి తాగునీటి విషయంలో పురపాలిక వాసులకు ఇబ్బందులు లేకుండా, నీటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.


## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు : సిఐ

**అల్లాదుర్గం, మ 25, ప్రభాతవార్త:**

అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ పరిధి లోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్, రేగోడ్ మండలాల్లోని డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సీఐ రేణుక హెచ్చరిం చారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లయితే రైతలు 100కు కాల్ చేయాలన్నారు.

## నర్సన్నపేటలో గ్రామ దేవతలకు బోనాలు

**మర్కుక్, మే 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నర్సన్నపేటలో బొడ్రాయి (నాభిశిల) విగ్రహ ప్రతిష్ట మొదటి వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలో రెండు రోజులుగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామదేవతలు పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని బోనాల నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్సన్నపేటలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

# ఘనంగా వరదరాజస్వామి రథోత్సవం

### హాజరైన ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎంపి అభ్యర్థి నీలం మధు



వరదరాజస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**మర్కుక్, మే 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వరదరాజ్‌పూర్‌లో గత వారం రోజులుగా వర్ధరాజస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. శనివారం స్వామివారి రథోత్సవం నిర్వహించగా దేవతామూర్తులను రథంపై అధీష్టింపజేసి భజనలు చేస్తూ గ్రామ పురవీధులగుండా హనుమాన్ స్వాములు, భక్తులు పోటీపడుతూ రథాన్ని లాగారు. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకొని రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేశారని, వర్ధరాజస్వామి ఆలయ పునర్నిర్మాణానికి, వర్ధరాజ్‌పూర్ గ్రామ అభివృద్ధి కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయగా 70 శాతం నిర్మాణ పనులు పూర్తి కాగా మిగతా పనులు నిధులు రాకపోవడంతో నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరుచేసి పనులను పూర్తిచేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు గానూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్, లక్కాకుల నరేష్, మాధవి రాజిరెడ్డి, స్వరూప మల్లేశం, రావికంటి చంద్రశేఖర్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపిటిసి నరేందర్, లక్ష్మినర్సమ్మ కనకయ్య, నాయకులు మంత్రం నర్సింలు, ఆలయ చైర్మన్ మురళికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్ కేంద్రంలో దుస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

## కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, మే 25 (ప్రభాతవార్త):** పట్టణంలో మంజీర దీపిక స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో నడపబడుతున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ఇచ్చిన యూనిఫామ్స్ టార్గెట్‌ను కుట్టుమిషన్ కేంద్రం నిర్వాహకురాలు ఆర్‌పి సుభద్రను అడిగి తెలుసుకున్నారు. 3,482 మంది విద్యార్థులకు అందించాల్సిన యూనిఫామ్స్ జూన్ 5వ తేదీలోగా ఆయా పాఠశాలలకు అందివ్వాలని కమిషనర్ సూచించారు.

## రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**జోగిపేట, మే 25 ప్రభాతవార్త:** అందోలులోని రంగనాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల ఆరంభ కార్యక్రమంలో భాగంగా ముందుగా శనివారంనాడు సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, దీక్షాస్వీకారం, అంకురార్పణ, ధ్వజపతాదివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అందోలు, జోగిపేట మున్సిపాలిటీ, సమీప గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## శ్రీబాల వీరహనుమాన్ ఆలయంలో అన్న వితరణ

**కౌడిపల్లి, మే 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ఎంతో మహిమానితమైన శ్రీ బాల వీరాహన్మాన్ ఆలయంలో శనివారం నాడు స్వామివారికి పూరోహితులు మెట్టు రాములుశర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఘనంగా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆదేశానుసారం ప్రతి శనివారం ఆలయంలో శ్రీబాల ఆంజనేయ స్వామి వారికి చందనాలంకరణం, శ్రీ మన్యసూక్తం, హారతి తదితరల పూజలు జరిపించి, పేదవారికి మధ్యహ్న సమయంలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టినట్లు పూజారి తెలిపారు. ఆలయం వద్ద అన్న వితరణ చేయదలచి దాతలు తమ పేర్లను నమోదు చేసుకోని అన్న దానంకు సరిపోను సరకులు లేదా, ఆర్థిక సహాయం చేసి ఆ దేవుని కృపకు పాత్రులు కాగలరని పూజారి విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వెల్దుర్తి, మే25 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు శేరిలా, ఎల్కపల్లి, చర్లపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో నేడు (ఆదివారం) ఉదయం 8 గంటల నుండి 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

**కొల్చారం, మే 25 ప్రభాతవార్త:** మండలంలో గడిచిన గురువారం గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న ఇళ్లను శనివారం ఆర్ఐ ప్రభాకర్ పరిశీలించారు. తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిన్నలచ్చిగారి దానయ్య, బాల సుగుణమ్మల నివాస పూరిండ్ల పై కప్పులు లేచిపోయి గోడలు దెబ్బతిన్నాయి, వర్షానికి తిండి గింజలు తడిసిపోయియాయి, పంచనామా నిర్వహించిన ఆర్ఐ నివేదికను ఉన్నతాధికారులకు అందించి బాధితులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, గంగయ్య తదితరులు ఉన్నారు.

## విత్తనాల కొనుగోలుపై అవగాహన

**నర్సాపూర్ మే, 25. ప్రభాతవార్త :** రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని ప్యాకింగ్ లేని విత్తనాలను కొనుగోలు చేయరాదని నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడిఎ సంధ్యారాణి రైతులకు సూచించారు. శనివారం నర్సాపూర్ మండల సీతారాంపూర్ గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ పొందిన దుఖాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు అట్టి బిల్లులనురైతుల భద్ర పరుచు కోవాలన్నారు. విత్తనాలపై ఏదైనా అనుమానం, సమాచారం ఉంటే వెంటనే సంబందిత అధికారులకు తెలియజేయాలని ఏడిఎ సంధ్యారాణి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రవేణి, తాజా మాజీ సర్పంచ్ పోచమ్మ లక్ష్మయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతం

**నర్సాపూర్ మే, 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో శనివారం మెడిసిటి హాస్పటల్ మేడ్చెల్ అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు సుప్రజ, ఐశ్వర్య, శౌర్య పాల్గొని ప్రజలకు బిపి, షుగర్, కంటి పరీక్షలు చేయడం జరిగిందని ఆ ఆసుపత్రి మార్కెటింగ్ ఇంచార్జ్ కుమారస్వామి తెలిపారు. అంతేగాక చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, గడ్డలు, కణతులు, థైరాయిడ్, గర్భసంచి సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, ఊపిరితిత్తుల వంటి పలు వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. 112 మందికి బిపి షుగర్ పరీక్షలు చేయగా 60 మందికి ఆపరేషన్ లు అవసరమని మెడిసిటి హాస్పటల్ కు సిఫార్స్ చేయడం జరిగింది. ఆపరేషన్‌లు అవసరముండి చేయించుకునే వారికి మెడిసిటి హాస్పటల్‌లో ఉచితంగా చేయడం జరుగుతుందని కుమారస్వామి తెలిపారు. అచ్చంపేటలో మెడిసిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, డాక్టర్లు సుప్రజ, ఐశ్వర్య, శౌర్య, మార్కెటింగ్ ఇంచార్జ్ కుమారస్వామి, నాగార్జున, శేఖర్, బాబు, సంధ్య పాల్గొన్నారు..



వనదుర్గా భవాని మాత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవానంద సరస్వతి

## భగవంతుడి స్మరణ ముక్తికి మార్గం

-మాధవానంద సరస్వతి స్వామి

**పాపన్నపేట, మే 25, ప్రభాతవార్త:** భగవంతుడి నామస్మరణతో మానవ జన్మకు ముక్తి మార్గంగా పనిచేస్తుందని మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామంలోని శ్రీ ఉమా కేదారేశ్వరి క్షేత్రంలో ప్రతి మాసం నిర్వహించే పూజా కార్యక్రమంలో మాధవానంద సరస్వతి మహారాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డాక్టర్ కావూరి శ్రీనివాస్ రచించిన ఏడుపాయల వనదుర్గా భవాని పుస్తకాన్ని (వనదుర్గ భవాని మాత స్థల పురాణం, చరిత్ర గంధం, గడుడ గంగ పురాణంతో కూడిన) మాధవానంద సరస్వతి స్మాఇ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజశేఖర్ శర్మ, రామన శర్మ, శ్యామ్ సుందర్ శర్మ, నర్సింలు గుప్తా, ఇంద్రసేనారెడ్డి, యాబన్న సేట్, భూమయ్య సేట్, అశోక్ సేట్, రవీందర సేట్, మహేందర్, సాయిబాబా, పార్థ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం గుర్తించిన విత్తనాలనే అమ్మాలి : ఏడిఎ

**వెల్దుర్తి, మే 25 ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి అన్నారు. శనివారం ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించి, వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లు అందరూ ప్రభుత్వం గుర్తించిన విత్తనాలను మాత్రమే అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి రోజు స్టాక్ రిజిష్టర్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. రైతులు బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవికాంత్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని విత్తనాల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎవో

**జోగిపేట, మే25 ప్రభాతవార్త:** రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంతో జాగ్రతలు తీసుకోవాలని ఏవో విజయరత్న రైతులకు సూచించారు. విత్తనాలు కొనేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతల విషయమై ఈ నెల 30 వరకు గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన కార్యక్రమంలో ఏవో విజయరత్న మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు వదులుగా ఉన్న సంచుల్లోని విత్తనాలు తీసుకోవద్దని, అలాగే విత్తనాలు తీసుకున్న డీలర్ల దగ్గర తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. పంటలు వేసుకునే విషయంలో విత్తనాల ఎంపిక ప్రక్రియ చాలా కీలకమైనందున నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు వివరించారు.

### కౌడిపల్లి మండలంలో...

**కౌడిపల్లి, మే 25, ప్రభాతవార్త:** మార్కెట్‌లో నకిలి విత్తనాల చెలమాణి అధికమైతున్న తరుణంలో విత్తనాలను కొనుగోలు చేసే విషయంలో తగు జాగ్రతలు వహించడానికి గాను వ్యవసాయాధికారులు రైతులకు అవగహన సదస్సులను నిర్వహించినట్లు ఎఓ స్వప్నజాదవ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని కౌడిపల్లి, ధర్మసాగర్, తునికి, హరిచంద్‌తండ, మహమ్మద్ నగర్, శేరితండ తదితర గ్రామాల్లో ఎఓ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఓ స్వప్న జాదవ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతు లూజుగా ఉన్న విత్తనాల బస్తాలను రైతులు కొనుగోలు చేయరాదని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర నుండి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేస్తే రైతులకు మేలు కల్గుతుందని ఆమె తెలిపారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో డీలర్ల నుండి రశీదు పొందాలని, పైగా పంట కాలం పూర్తిగా అయ్యేవరకు రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఈమె తోపాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రాజశేఖర్ గౌడు, దివ్యశ్రీ, గౌతమి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

**జగదేవ్‌పూర్, మే 25 (ప్రభాతవార్త):** ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాలు కొనేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని నిర్మల్‌నగర్, అలిరాజపేట, బిజివెంకటాపూర్, మునిగడప, గొల్లపల్లి, కొండాపూర్, బస్వాపూర్, ఎల్లాయగూడ, వట్టిపల్లి, చాట్లపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు కొనేటప్పుడు ప్రతి రైతు రశీదు తీసుకోవాలని, రశీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని అన్నారు. విత్తన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. పంటలలో అధిక దిగుబడులు పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, ప్రభుత్వం ద్వారా జనుము, జీలుగ విత్తనాలు రాయితీపై లభిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఖలీల్, శరణ్య, భాను, కృష్ణమూర్తి, కిరణ్, సమత, రైతులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీచేసిన ఎస్ఐ

**జగదేవ్‌పూర్, మే 25 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఎస్ఐ చంద్రమోహన్, ఏఓ వసంతరావుతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రశీదు బుక్, స్టాక్ రిజిస్టర్‌ను డీలర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు విధిగా రశీదు ఇవ్వాలన్నారు. ప్రతి డీలర్ దుకాణం ముందు స్టాక్, ధరల బోర్డును ప్రదర్శించాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**చిన్నశంకరంపేట, మే 24, ప్రభాతవార్త:** అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతోపాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఏడీఏ విజయ నిర్మల అన్నారు. శనివారం గవ్వలపల్లి తండా, కామారం గ్రామాల్లో వానా కాలంలో రైతులు ఎలాంటి విత్తనాలను తీసుకోవాలి, ఎలా వినియోగించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో పంటలను పండించాలని, అధిక మోతాదులో రసాయనాలను వినియోగించవద్దని ఆమె సూచించారు. రైతులు విత్తనాలను తీసుకున్న దుకాణాల నుంచి తప్పనిసరిగా రశీదులుతీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అనుమతినిచ్చిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. దుకాణంలో స్టాక్ బోర్డు, లైసెన్స్ వివరాలను ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం గవ్వలపల్లిలోని విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

## విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన

**న్యాల్‌కల్, మే 25, ప్రభాతవార్త:** విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రశీదును తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి లావణ్య సూచించారు. శనివారం తాట్‌పల్లి, టేకూర్, కల్బేమల్, రాంతీర్థం, అత్నూర్, హుమ్నాపూర్ గ్రామాల్లో విత్తనాల కొనుగోలు చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ విస్తీర్ణత అధికారులు అవగాహన కల్పించినట్లు ఏఓ లావణ్య సూచించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్సు కల్గిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విధిగా రశీదులు పొందాలని, రశీదుపై డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలని, విత్తన ప్యాకెట్‌పై తయారైన తేతి, కాలం ముగిసన తేదీ చూసుకోవాలన్నారు. రశీదును పంట దిగుబడి వచ్చేవరకు ఉంచుకోవాలన్నారు.

### పుల్కల్ మండలంలో...

**పుల్కల్, మే 25, ప్రభాతవార్త:** మండలంలోని గొంగ్లూర్ గ్రామంలో శనివారం విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 30వ తేదీవరకు మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కోనుగోలు చేయవద్దని, కొనుగోలు చేసిన ప్పుడు విధిగా రశీదు పొందాలని, రశీదును పంట దిగుబడి వచ్చు వరకు దగ్గర పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నరసింహా రావు, ఎడిఎ అరుణ, మండల వ్యవసాయాధికారి చైతన్య, ఏఈఓ మనీష పాల్గొన్నారు.

### అల్లాదుర్గం మండలంలో...

**అల్లాదుర్గం, మే 25, ప్రభాతవార్త:** విత్తనాలు కొనుగోలు చేసేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని చిల్వర్ మహమ్మదాపూర్, రెడ్డిపల్లి, కాయిదంపల్లి, ముప్పారం, అపాజపల్లి గ్రామాల్లో రైతులకు విత్తన కొనుగోలు సందర్బంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించరు. ఈ సందర్బంగా వ్యవసాయ సహాయ సంచాలకులు రాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు విడిగా ఉన్న విత్తనాల సంచులను కొనవద్దన్నారు. అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి, రశీదు తీసుకుని దగ్గరపెట్టుకోవాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నవీన్, మహేష్, అమృత్, విఠల్‌రావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు : ఎవో

**మనూర్, మే 25, ప్రభాతవార్త:** నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మనూర్‌తో పాటు మండలంలోని రాయిపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులను ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన నాణ్యమైన పత్తి విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని దుకాణం నిర్వాహకులకు సూచించారు. దుకాణాల నుంచి సేకరించిన శాంపుల్స్ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందని ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ నిర్వహకులు మారుతి, రైతులు పాల్గొన్నారు.

## విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎవో

**నాగల్‌గిద్ద, మే 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రైతులు విత్తనాల కొనుగోలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి వెంకటేశం పలు సూచనలు, సలహాలు అందచేశారు. రైతులు అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు అందుకుని పంట దిగుబడి వచ్చేవరకు దగ్గర పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మహిపాల్, నగేష్, సంతోష్, స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఝరాసంగం, మే 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఈ నెల 26న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ అధికారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అదికారులకు తమ వంతు సహకారం అందించాలని ఏఈ సూచించారు.

## ఘనంగా దేవర్షి నారద మహర్షి జయంతి వేడుకలు

**రామచంద్రాపురం, మే 25, ప్రభాతవార్త:** సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవర్షి నారద మహర్షి జయంతి ఉత్సవాలను రామచంద్రాపురం పట్టణంలోని బిహెచ్ఈఎల్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జయలక్ష్మిమాత హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రచార ప్రముఖ్ బోయిని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ 1925ల మొదలయిందని 1994 నాటికి ప్రచార విభాగం ప్రారంభించి జాతీయవాద జర్నలిజం గురించిన సందేశం సమాజంలో వ్యాపింపచేస్తున్నదని తెలిపారు. ది ఆర్గనైజర వార పత్రికకు దక్షిణమధ్య బ్యూరో కుంటి సురేందర్ మాట్లాడుతూ నారద మహర్షిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత పాత్రికేయులు సమాచారాన్ని లోక కళ్యాణానికి దేశం రక్షణకు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సమాచార భారతి సంయుక్త కార్యదర్శి ఉప్పల ప్రదీప్, రామచంద్రాపురం నగర ప్రచార ప్రముఖ్ అరవిందర్, నగర ప్రచార ప్రముఖన మనోజ్ తదితరులు హాజరు కాగా కార్యక్రమానికి హాజరైన వారికి బోజన ప్రసాదం వితరణ చేసి కార్యక్రమాన్ని ముగించారు.

## ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ



నూతన పాలకవర్గం

**హుస్నాబాద్, మే 25, ప్రభాతవార్త :** పట్టణంలోని గోదాంగడ్డ శ్రీఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ నూతన అధ్యక్షునిగా బల్లు సంపత్, ఉపాధ్యక్షులుగా కేశవేణి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పోలవేణి శ్రీధర్, కోశాధికారిగా బొల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా చామంతుల సందీప్, గూల్ల మల్లేశం, ఇటిక్యాల వేణు, గూళ్ల తిరుపతి, బొల్లి రాజు, గుంటుపల్లి శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీశైలం, ఎర్రబెల్లి ప్రశాంత్, తిప్పట్ల లక్ష్మీ, నీలం తిరుపతిరెడ్డి, బూరుగు కిష్టస్వామిలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అధ్యక్షునిగా ఎన్నుకున్న సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

## కొండపోచమ్మ నీటి సంపులో పడి వ్యక్తి మృతి

**మర్కుక్, మే 25 (ప్రభాతవార్త):**

కొండపోచమ్మ నీటి సంపులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రం మర్కుక్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నీలం రమేష్ గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సమీపంలోని కొండపోచమ్మ నీటి సంపులో పడి మృతిచెందాడని తెలిపారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.